# నమ్మలేని నిజాలు

భోజనానికి వచ్చిన రామకృష్ణకి అన్నం, పప్పు, చారు, కూరలూ అన్నీ వేడి వేడిగా పొగలు క్రక్కుతూ కన్పించాయి. ఏదో ఆ ఉప్పూ, మజ్జిగా మంచినీళ్లూ మాత్రమే చల్లగా వున్నట్లూ— చిన్న తమాషా చేస్తే కమలకూడా వేడెక్కిపోతుందనిపించింది.

చిరునవ్వుతో తన పీటమీద కూర్చుంటూ "ఒరే, చిన్న కథ చెప్పనా? భలే తమాషా కథలే!" అన్నాడు.

చల్లార్చుకొని, భోజనం చేయడానికి తిప్పలు పడుతున్న పిల్లలు ఈ మాటలతో ఎగబడ్డారు.

"చెప్పండి నాన్నగారూ, చెప్పండీ! ఈలోగా అన్నమైనా చల్లారుతుంది." అన్నారు.

కమలమాత్రం ఓ సారి గంభీరంగా భర్తకేసి చూచి, మళ్లీ తనపనిలో నిమగ్నురాలై పోయింది.

రామకృష్ణ మందహాసంతో మెల్లగా "తెనాలిరామలింగడి పిల్లి" కథ చెప్పనారంభించాడు. అతని ఉద్దేశ్యం, కథంతా చెప్పి, చివరన "అలనాడా రామలింగడు అలా వేడిపాలుపోసి పిల్లికి పాలు పోసేబాధ తప్పించుకొన్నాడు; ఈ నాడీ రామకృష్ణ అర్ధాంగి వేడి వేడి అన్నాలెట్టి ఇక అన్నం పెట్టేబాధ తప్పించుకోవాలని చూస్తున్నట్లుందీ!" అని చమత్కరించాలని. కాని, పాపం—అతను కథ ప్రారంభించగానే అవాంతరం ఎదురయ్యింది!

"ఉహూఁ! ఈ కథా? నా కెనాడో తెల్సు. ఒద్దుబాబూ, మరోకథ చెప్పండీ" అన్నాడు, పెద్దబ్బాయి.

"నాకూ తెల్సులే." అని అడ్డొచ్చింది, పెద్దమ్మాయి.

"నాకు తెలీదు నాన్నగారూ, చెప్పండీ, పూర్తిగా. నే వింటానుగా" అని అక్కనీ, అన్ననీ కసురుకొంది, చిన్నమ్మాయి.

చిట్టాడు మాత్రం సాలోచనగా "నాన్నారూ, నాన్నారూ! మరీ-మరే- రామలింగడంటే మీరే కదూ? నాకు తెల్సులేండి" అన్నాడు, ఉన్నట్లుండి.

రామకృష్ణ నవ్వి "నేను రామకృష్ణనిరా! వాడు రామలింగడు!" అన్నాడు.

## కె. పి. బాబు

క్రిందటిసారి తాను చూచిన 'తెనాలి రామకృష్ణ' సినిమా గుర్తుకు తెచ్చుకొంటూ, వాడు "ఊఁ! పోండి! రామలింగడన్నా, రామకిట్నుడన్నా, ఒకళ్ళేనని అమ్మ చెప్పలా! ఆ రామకిట్నుడి పెళ్లాం పేరూ మనమ్మ పేరేగా?" అన్నాడు.

ఆ మాటలకి కమలకికూడా నవ్వువచ్చింది కాని, బిగబట్టుకొంది

రామకృష్ణ నవ్వుతూనే "అయితే ఆ రామకృష్ణుడికి ఒక్కడే కుర్రాడుగదా, ఈ రామకృష్ణుడికి ఇంతమందేమిట్రా పిల్లలూ" అని ప్రశ్నించాడు.

వాడు ఓ క్షణం ఆలోచించి "ఆ సినీమా తీసేసరికి ఇంకా పుట్టలేదేమో!" అని జవాబిచ్చాడు.

"ఓరి పొట్టోడా! పుట్టేడు బుద్ధులూ నీకు, నిజంగాను!" అంటున్న భర్తకి అడ్డు తగిలి కమల "ఏం, గొప్పకర్ర లాగుండే మీ కెం బుద్ధులకి కొదువనా?" అంటూ లేచింది.

"సిగ్గు లేకపోతే సరి! ఈ మిటమధ్యాన్నపు వేళకిగాని పొయ్యిలో పిల్లిని లేపలేకపోయారు, పైగా వేడివేడిగా వున్నాయి వంటలని తెనాలి రామలింగడి పిల్లికథ చెప్తాస్తున్నారు! ఆయనంటే—ఆ పిల్లి మూతి కాల్చడంవల్ల అవు పాలన్నా పొందాడు; నేను మీమూతి కాల్చి ఏం పొందగలనని?"

ఇంక చాలు, అధికమైతే సరసం విరసమేనని రామకృష్ణ మందహాసంతో ఊరుకుండిపోయాడు

అతని ఓటమితో కమలకి ఇంకొంచెం ఏడ్పించాలనిపించింది.

"ఊరుకుండిపోతే సరిపోతుందనుకొంటున్నారా, పాపం! ముందున్నది ముసల్ది పండుగ—ఇరనై ఆగ్రో తేదీ!" అంది

అమ్మ అలా అనగానే చిన్నమ్మాయి గభాలున లేచింది "ఓ! ఇది జనవరి నెల కదూ?" అని గబగబా వాళ్ల నాన్న దగ్గరికి వెళ్ళి ఠీవిగా నిల్చింది. "ఏమండోయ్, ఇలా చూడండి సార్! గుర్తుందా, రిపబ్లిక్ డే! మనం పుట్టినరోజు! హే!" అని హెచ్చరించింది, సగర్వంగాను

దించిన తల వెంటనే ఎత్తలేక పోయాడు రామకృష్ణ

సరసం విరసమైపోయింది! కాకపోయినా, రిపబ్లిక్ ఉత్సవాలైనా, ఆ పిల్లకి తన పుట్టినరోజు గుర్తులేక మానవు; అప్పుడయినా అది గోలచేయక ఊరుకోదు! ఇంతకీ అది పుట్టక పుట్టక ఆ రిపబ్లిక్ డేనాడే ఎందుకు పుట్టాలని! పుట్టింది అనుకొందాం, అసలీ కష్టకాలంలో ఈ పుట్టినరోజులూ, పెళ్ళిరోజులూ-ఇవన్నీ చేసుకొని తీరాలనే పట్టుదలలేమిటి?...

అంతలోనే, "ఛా! పసిపిల్ల! పెద్దాళ్ళం అన్నీ తీర్చుకొన్నాం చక్కగానే! పాపం ఈ పిల్లలవిషయంలో ఈ కమ్మ్ర ర ఊహ



ప్రెసిడెంట్
వెజిటబుల్ హేర్ ఆయిల్,
స్నో, టాల్కమ్ పౌడర్
నా ఉపయోగానికి శ్రేష్టమైనవని నేను కనుగొన్నాను
—(సం) అంజలీ దేవి
ఉత్పత్తిదారులు:
రథోడ్ ట్రేడింగ్ కంపెనీ, మద్రాసు - 1.

మిటీ?" అనుకొని ఆ వెంటనే బాధపడి, రామకృష్ణ నవ్వుతూ తలెత్తాడు.

"దానికేంలెల్లీ! మాదక్కా గా జరుపుకొందాం!" అన్నాడు.

"ఏది జరుపుకొందామనుకోవడం లేదూ? అవే జరగడంలేదు గాని!" అని మూతి విరిచింది కమల.

"అదే-అదే-చూస్తుండూ" అని గబగబా భోజనం చేయడం ముగించాడు.

*  *  *

జనవరి-ఇరవైఆరో తేది ఉదయానికి రామకృష్ణ జేబులో దమ్మిడీ లేదు

నెలాఖరురోజులని తను తలపట్టి ఆలోచిస్తుంటే-ఇంట్లో ఏమీ లేవని అర్ధాంగి హెచ్చరికలు, పుట్టింరోజని చిన్నమ్మాయి గోల!...

సైకిలెక్కి సరాసరి రావు ఇంటికి వెళ్ళాడు.

"ఏమిటో బ్రదర్ విశేషాలు? ఊరకరారు మహానుభావులు!" అన్నాడతను మందహాసంతో.

ఇంట్లో ఏమీ లేవంటే బాగోదని, చిన్నమ్మాయి నష్టం చేసుకొన్నాడు రామకృష్ణ.

"ఇదిగో నాదగ్గరున్న వే పదిహేను రూపాయలు! నీవో పది పుచ్చుకో. అయిదుతో నేను ఒకటో తారీఖు చూడగలనే గాని, ఒక చిన్న సలహా-మనబోటి బ్రతికి చెడ్డవాళ్లకి ఈరోజుల్లో కూడా ఇంకా ఈ పుట్టింరోజు పండుగలూ, పబ్బాలూ ఏమిటో బ్రదర్? పిల్లలంటే సర్దాలూ, ప్రేమలేని వాడినేం కాదు గాని, కాలాన్ని బట్టి చెప్తున్నాను, తగ్గాలి తగ్గాలీ అని" అన్నాడు స్నేహితుడు.

నిజమేననిపించింది రామకృష్ణకి. నిత్యజీవితమే గడవడానికి కన్ని ఇబ్బందులూ పడుతుంటే, మధ్యమధ్య ఈ వినోదాలు, విలాసాలూ ఎటూతట్టుకొనేది! ఉన్నప్పుడు చేసుకొన్నా, లేనప్పుడు విరమించుకోవాలి గాని లేకుంటే ఎట్లా బ్రతికేది?... ఇంతకీ కలవారింటి పిల్లని పెళ్లి చేసుకోవడంవల వచ్చిన తిప్పలివి - అని నాలిక్కరుచుకొన్నాడు. అది సరిగాదు — పెద్దలు చేతికందించిపోయిన సిరిసంపదలను విచ్చలవిడిగా ఖర్చు చేసుకొన్న స్వయంకృతాపరాధం, అని మళ్ళీ సమాధాన పర్చుకొన్నాడు.

ఏదో ఒకటి తే కొనిద్దూ—అనుకొంటూ బజారుకిపోయి, ముందుగా చిన్నమ్మాయికి ఒక గౌనూ, లంగా కొని, ఆ పైన ఆ రోజుకి ంటి కవసరమైన వస్తువులుకొని మిగిలిన ల్లర జేబులో వేసుకొని. తిన్నగా ఇంటి గారి పట్టాడు.

నాన్నగారి చేతిలో నుండి పొట్లాం లాక్కొని మహానందంగా గంతులేస్తూ చిన్నమ్మాయి "అచ్చచ్చ! కొత్త బట్టలు—నాకే!" అంటూ లోనికి పోయింది.

ఆక్షణంలో రామకృష్ణకి "ఎంతైతే నేమి? ఏమైతే నేమి? కన్నబిడ్డల తృప్తి చూడగలితే చాల్నుగదా, మనిషన్నవాడికి!" అనిపించింది.

అంతలోనే చిట్టాడు "నాకేవి నాన్నగాలూ? ఊఁ!" అంటూ రాగాలు ప్రారంభించాడు. వాడి వెనకనే పెద్దమ్మాయి "స్కూలుకి పోవడానికే సిగ్గేస్తుంది, ఒక్కటే మంచి చొక్కా లేదండీ!" అని గుణిశాడు. అతనికి వంతపాడింది పెద్దమ్మాయి

ఏమీ తోచక రామకృష్ణ తిన్నగా ఇంట్లోకి—ఆ పిల్లల్ని తీసుకుపోయాడు.

అక్కడ కమల ధర తెచ్చిన గౌనూ, లంగా చిన్నమ్మాయికి తొడిగి గిరగిరా త్రిప్పి ఊరికే నవ్వుతోంది రామకృష్ణ లోనికి రాగానే అతని ముందుకా పిల్లని తోస్తూ "పోవే, చాల బాగున్నావులే, అచ్చం మాల పిల్లలాగ!" అంది.

ఆ పిల్ల తండ్రి దగ్గరకిపోక, సిగ్గుతో ఓ మూలకిపోయి, తను తొడుక్కున్న బట్టలు చూసుకొంటూ నిల్చుంది.

"ఏం బాగాలేవా?" అనడిగాడు.

"ఇన్నేళ్లుగా సంసారం చేస్తున్నారు, ఈరోజుకీ మీకు ఎటువంటి బట్టలు కొనాలో తెలీలేదండీ!" అని ఊరికే నవ్వుతూ, "అవి మాలపిల్లలు కట్టుకొనే గుడ్డలు!" అంది.

తన తెలియనితనానికేమీ బాధ కలుగలేదు రామకృష్ణకి కాని, భార్య అంత నాగరీకురాలూ, అతి తేలిగ్గా 'మాల పిల్లల్ని', వాళ్లు కట్టుకొనే బట్టల్ని చులకన చేసి మాట్లాడ్డూవుంటే ఎంతైనా చురుకు తగిలింది.

ఈ లోగానే కమల లోనుండి ఒక





# వెద్ద గడ బిడ

యీ షాహుకారునకు ఒక్క క్షణము కూడా విశ్రాంతి లేదు. కాని స్నానము చేయునప్పుడు ఈ యన చేసే గడబిడతో పోలిస్తే, స్టాకు మార్కెటులో ఈ యన చేయు గడబిడ యెందుకు సరి తూగదు. యిదంతా హమామ్ సబ్బుయొక్క ప్రభావం. షాహుకారుగారేమంటారంటే జీవితంలో విశ్రాంతి పొందుటకు సాధనం హమామ్ సబ్బుని. యిటువంటి ప్రశంస తో మాకు నమ్మకములేదు, కాని షాహుకారుగారేమన్నా చెప్పనివ్వండి లేక చెయ్యనివ్వండి, ఒక్క విషయం మాత్రం తప్పక ఒప్పుకొని తీరాలి, అదేమిటంటే స్నానమునకు పనికివచ్చే సబ్బులలో హమామ్ సర్వోత్కృష్టమైనది.




అత్యధిక ఉత్సాహము పొందండి

టాటా యొక్క

# హమామ్

టాయిలెట్ సబ్బు

టాటా ఆయిల్ మిల్స్

భారతీయవిధి మరియు వ్యవస్థచే భారతదేశములోనే నిర్మాణించబడినది.

# ★ నమ్మలేని నిజాలు ★

పార్సిల్ తెచ్చింది. అందులో ఒకవెల్వెట్ ఫ్రాకూ, సిల్కులంగా ఉన్నాయి!

"మా బెజవాడక్కయ్య ఈ మెయిల్లో ఎవరో వస్తుంటే, గుర్తుచేసుకుని మరీ దీని పుట్టింరోజు కివి పంపింది—చూచారా?" అని జబర్దస్తీగా చూపెట్టింది.

అంతవరకూ చూడని కారణాన పిల్లలంతా అమ్మపైకి ఎగబడ్డారు.

రామకృష్ణకి తల తీసేసినట్లయింది. ఆ 'బెజవాడక్కయ్య' సంగతి తనకి తెలియనిది కాదు. పాపం, ఆ 'బావ'గా రెంత అభాగ్యుడో! తానింకా నయం, తన పెళ్ళాం పిల్లలకోసమే ఇన్ని అవస్థలూ పడుతున్నాడు. ఆయనగారు ఇతరుల పెళ్ళాం బిడ్డలకోసమూ శ్రమ పడ్డాడుగదా! తనచెల్లి బిడ్డ పుట్టింరోజుకీబట్టలు పంపితీరాలని కనీసం ఒక రాత్రియినా ఆమె, ఆయనపై సత్యాగ్రహం చేసివుంటుంది! ఆయనకీ నెలాఖరు రోజులే! ఊరంతా పిచ్చాడిలా తిరిగి తిరిగి, ఏ స్నేహితుల కాళ్ళో, గడ్డాలో పట్టుకొని మరీ ఇవి కొని పంపి 'ఆవిడ' గారికి సంతృప్తి కలిగించి వుంటాడు!

సంసారం!

ప్రేమసుధా పూరమా?


దుఃఖ సాగరమా?

ఏది సత్యం?...ఏది తనకి అర్థంగాక, ఎవరినడిగితెల్సుకో నేది తెలియక రామకృష్ణ తలొంచుకొని బయటికి వచ్చాడు.

## 2

ఆ పూట పిండివంటలతో సహా చక్కని భోజనాలు తయారుచేసింది కమల. పిల్లలంతా ఉత్సాహంగా భోజనం చేస్తున్నారు. రామకృష్ణ తన కెదురుగా కూర్చున్న చిన్నమ్మాయి వేసుకొన్న 'బెజవాడ బట్టలు' చూచి, కమలని "నేను తెచ్చిన బట్టలేవీ?" అనడిగాడు.

"పెద్ద పెట్టెలో పెట్టాను. ఇంట్లో ఉన్నప్పుడు వాడుకోవడానికి పనికొస్తాయి లెండి!" అంది, భర్త బాధ తగ్గించాలని.






భోజనాలవీ అయ్యాక, "మరి రేపటి సంగతో?" అంది మెల్లగా, కమల.

రామకృష్ణ ఆలోచనలో పడ్డాడు...

మళ్ళీ రేపొద్దుటే ఊళ్ళోపడి అడుక్కోవాల్సిందేనా? ఛి, ఛీ! - అన్పించింది కాసేపు...మళ్ళీ కొంతసేపు 'ఛి, ఛీ అనుకొంటే ఎట్లాగు? ఇది జీవితం!' అన్పించింది.

చప్పున ఒకటి గుర్తుకొచ్చింది....ఉదయం బజార్లో బాబాయిగారగుపించారు. "ఏం నాయనా, అసలు కన్పించడమే లేదు. వీలైతే ఇవ్వాళైనా పిల్లల్ని తీసుకొని అలా రాకూడదా? బ్రహ్మాండంగా వుంటుంది ఉత్సవం!" అన్నారు. "వీలైతే తప్పక అంతా వస్తా"మని చెప్పాడతను...

రామకృష్ణ ఈ రాయపురం స్టేషనుకి ట్రాన్స్ఫర్ కాకముందు అతని నివాసం మౌంట్ రోడ్డులో ఆ బాబాయిగారింట్లోనే.

ఆయన మదరాసులో స్థిరపడిపోయిన ఆంధ్రుడు. రిటైర్డు ప్రభుత్వోద్యోగి. మౌంట్ రోడ్డు ప్రక్కనే గల కోమలేశ్వరన్ పేటలో స్వంత డాబా ఇల్లుంది. తినడానికిన్ని గింజలిచ్చే పొలముంది. ఖర్చుకి కావలసినంత రొఖ్ఖం బాంకీలో వుంది. ఆయనా, భార్య ఇద్దరే. సంతానం లేదన్న దిగులొక్కటె తప్ప వారికే చీకు, చింతా లేదు.

వాళ్ళింట్లో కొంతభాగం అద్దెకిస్తుండే వాళ్ళు. ఆ భాగం బ్రహ్మచారుల కివ్వమనే వాళ్ళు. అది ఒక మాదిరి సంసారానికి సరిపోదు! అటువంటిది ఈ రామకృష్ణకి చక్కగా నచ్చింది. తనూ, భార్య, పిల్లలు హాయిగా వుండొచ్చు - మరచి ప్రదేశం, తెలుగు పొరుగు కూడా అనుకొన్నాడు. కమలకీ నచ్చడాని కదే కారణం!

ఆ వృద్ధదంపతులకి సైతం వారింట్లో అంతమంది ఎక్కువగా అద్దెకు వుండక పోయినా, ఉండిపోయిన కొద్దిమందిలో ఈ రామకృష్ణ, కమల లంత ఇదిగా ఎవరూ ఆకర్షించలేదు.

'చిలకా గోరింకల్లాగు వుంటారు ఈ మొగుడూ పెళ్ళామునీ - 'రత్నాలు, ముత్యాలు వాళ్ళ పిల్లలనీ ఆ వృద్ధదంపతుల కన్పించేది.

అనతి కాలంలోనే వాళ్ళ పేరు మరుపులో పడిపోయాయి. రామకృష్ణ వాళ్ళని "బాబాయిగారూ, పిన్నిగారూ" అనే పిలిచేవాడు. కమలేమో "మామయ్యగారూ, అత్తయగారూ" అనేది.

అంతకాలం మిగిలివున్న ఒక్కలోటు కూడా ఈ యువదంపతుల వున్నట్టూ

అంటూ ఆ వృద్ధులకి తీరిపోయింది. "అబ్బాయీ, అమ్మాయీ" అంటూ ఎంతో ఆప్యాయంగా చూచుకొంటూ వచ్చారు, వీళ్ళనే. పిల్లలు కూడా "తాతగారూ, మామ్మగారూ" అంటూ అలవాటైపోయారు. దానితో వారిదిక నవజీవనమైంది.

అలా ఏకధాటిగా రెండున్నర ఏళ్లు అక్కడ వున్నారు. అప్పటికి రామకృష్ణని బీచీ స్టేషన్నుండి రాయపురం స్టేషన్కి ట్రాన్స్ఫర్ చేశారు. బీచీలో పని చేస్తుండగా అతనికి 'క్వార్టర్స్ లేవు, బయట ఎక్కడున్నా అద్దెకుండ'మన్నారు. రాయపురంలో పని వచ్చాక, అక్కడ క్వార్టర్స్ వున్నాయి కనుక, విధిగా అక్కడికేపోయి కాపుర ముండాలీ అన్నారు అధికారులు!

సాధారణంగా అంతా అద్దె కొంపలొదిలి క్వార్టర్స్కి పోవాలని ఆత్రపడ్తారు కాని, రామకృష్ణ దంపతులు ఈ వృద్ధ దంపతులను వదిలిపోయి ఆ మూల క్వార్టర్సులో నివసించడానికెంతో బాధపడ్డారు కాని, ఉద్యోగ ధర్మం నిర్వర్తించక తప్పలేదు!

కలిగిన ఎడబాటుకు ఆ వృద్ధ దంపతులూ ఈ యువ దంపతులూ చాలా విచారించారు. కాని, 'ఒకే ఊళ్ళో వున్నాం ఇంకా ఎందుగాదా' అని తరువాత ఊరడిల్లారు. ఆ పై పండుగల్లో, సెలవల్లో, వీళ్ళు వారింటికి లేక వాళ్ళు వీరింటికి పోయి ఒకటి రెండు నాళ్ళుండి మరీ రావటం జరుగుతూ వుండేది.

ఇప్పుడు బాబాయి గారింటికిపోతే అన్ని విధాలా మంచిదని, ఆలోచించాడు రామకృష్ణ. వెంటనే కమలకి చెప్పి పిల్లల్నీ ఆమెనూ తయారవమన్నాడు.

నాటి సాయంత్రం రామకృష్ణ, భార్యా బిడ్డల్ని వెంటేసుకొని అలా కస్టమ్స్హౌస్ వరకూ నడక సాగించాడు. హైకోర్టు దగ్గర బస్ స్టాపింగ్ వద్ద ఆగకుండా ముందుకి వెళుతున్న రామకృష్ణని చూచి "అదేమిటండీ, ఇక్కడ బస్సెక్కొద్దూ?" అంది కమల.

"కాదు, అలా హార్బర్ దగ్గరికి పోయి, అక్కడట్వంటీవన్. సి. ఎక్కుదాం—పదండి" అంటూ నడిచాడతను

రామకృష్ణ ఆశించినట్లే అక్కడ డబుల్ డెక్ బస్సు బయలుదేరడానికి సిద్ధంగా వుంది.

నడిపేస్తున్నాడని అంతవరకూ తండ్రి మీద అలిగిన పిల్లలు అదిచూచి "భలే, భలే" అన్నారు. అందరూ బస్సు పై అంతస్తులో కూర్చున్నారు.

బస్సు పారిస్ కార్నర్ దాటేసరికి దీపాలు వెలిగాయి. రిపబ్లిక్ ఉత్సవ సౌందర్యం—డబుల్ డెక్ బస్సులో కూర్చున్న పిల్లలకి మరీ సంతోషం కల్గించింది

అందులో చిన్నమ్మాయికి మరింత ఎక్కువ సర్దాగా వుంది. తను ధరించిన వైట్ ఫ్రాక్, నీలు లంగా, తడిమి చూచుకొంటూ, ఉత్సవ కోలాహాలాన్ని గమనిస్తూ ఆ పిల్ల గర్వపడసాగింది.

బస్సు అలా సెంట్రల్ దగ్గరకొచ్చి ఆగింది... సెంట్రల్ స్టేషన్, ఎస్. ఐ. ఆర్. ఆఫీసూ రంగు రంగుల దీపాలతో, వైభవోపేతంగా ప్రకాశిస్తున్నాయి.

"అక్కా, అక్కా, అటుచూడవే— ఆ లైట్లు ఎలా తిరుగుతున్నయ్యో—భలే!" అన్నాడు చిట్టాడు. అప్పటికి గాని అవకాశం చిక్కనట్లుగా చిన్నమ్మాయి- "చూచావా మరి, మన పుట్టిం రోజంటే ఎంత ఇదిగా వుంటుందో! నీ పుట్టిం రోజూ వుంటుంది, అమావాస్యలాగ!" అని సగర్వంగా వెక్కిరించింది. ఇక వాడందుకొన్నాడు రాగాలాపన!

కమల కసురుకోవటం, రామకృష్ణ సముదాయించడం ముగియకముందే, మౌంట్ రోడ్డులో బస్సాగింది.

ఆ రాత్రి ఆ వృద్ధదంపతులు వీళ్లందరితో కళ్ళ రిపబ్లిక్ ఉత్సవాలను ఎంతో ఉల్లాసముగా చూచి ఆనందించారు. పిల్లలకీ పరమానందంగా తోచిందారోజు. అప్పటికీ రామకృష్ణకి మనశ్శాంతి కలుగలేదు.

అతను వచ్చేముందు తివతో ఒక ప్యాకెట్టు తెచ్చాడు. అందులో ఉదయం తాను కొన్న గౌను, లంగా వున్నాయి. అది కమల చూచిందిగాని, దేనికి తెస్తున్నారని అడగలేక పోయింది. చూస్తూవుంది. ఆ ప్యాకెట్టుని - బాబాయిగారింటి ప్రక్కింటిలో అద్దెకుంటున్న బీదమిత్రుని పిల్లకి రాగానే రామకృష్ణ ఆదరంతో ఇవ్వడం చూచింది. అప్పుడు మాత్రం ఉండబట్టలేక చాటుగా "అదేమిటండీ?" అనడిగింది.

రామకృష్ణ వెటకారంతో కూడిన నవ్వు నవ్వాడు. "మరేం లేదులే, మనమైతే వాటిని ఇంట్లోనే ఉపయోగిస్తాము. వాళ్లు బయట కూడా వాడుకోగలరు, అంగుకని ఇచ్చేశాను!" అన్నాడు.

మళ్లీ ఆ విషయంలో కమల నోరెత్తలేదు. అప్పటికి రామకృష్ణ తృప్తి కలిగినట్లుగా ఈలపాట సన్నగా ప్రారంభించాడు....

"ఏం నాయనా, చాలరోజులకి తెచ్చావు అమ్మాయినీ, పిల్లల్నీ. మళ్లీ రేపే ప్రయాణం అంటావా?" అనడిగింది అద్దుతగిలి పిన్నమ్మగారు.

"అహాహా! ఇలా తీసుకువస్తే వాళ్లకి రిపబ్లిక్ ఉత్సవాలు చూపినటవుతుంది, మీకు వాళ్లని చూపినట్లూ అవుతుందని తీసుకొచ్చాను" అని ఆగి, ఒకసారి గట్టిగా ఊపిరి పీల్చాడు. "ఒకటో తారీఖుదాకా ఇక్కడే వుంచేస్తాను. ఇప్పుడెక్కడికిపోయి మాత్రమేం ప్రయోజనం? ఆ కుండలతో కుస్తీలు పట్టలేక బాధపడ్డమేగదా?" అని మందహాసంచేసి, "ఆ కుస్తీలైనా నిండు కుండలతోనైతే ఫర్వాలేదనుకోండి గాని ఖాళీ కుండలతోగదా! కొంపదీసి అవి కాస్తా పగిలిపోతే, కొత్తివాటిని తేవడానికి నేను చావాలి మళ్లీను..." అన్నాడు.

కమలముఖం ఆ చీకటి వెలుగులో అంత స్పష్టంగా కన్పించలేదు, అయినా, తేరిపార చూడ్డానికతను సాహసించనూలేదు...

రామకృష్ణమాటలు విని పిన్నమ్మగారు నవ్వేశారు ఆమె ప్రక్కనే వున్న బాబాయిగారూ నవ్వుతూ అతని వీపుతట్టి చాల్లే ఇక "ఊరుకో! ఎవరన్నా విన్నా నవ్వి పోతారు. మరీ అంతమోటు సరసాలా? చూడు, అమ్మాయి ఎలా చూస్తోందో నిన్ను—మింగేసేటట్లుంది!" అన్నారు......

భోజనాలయ్యాక కమల వీలు చూచుకొని ఒంటరిగా రామకృష్ణని కల్సుకొంది.

ఇందాక అతనన్న మాటల్లో అబద్దాలేవీ లేనిమాట నిజమేకాని, అవసరమైతే కడుపులో కాళ్లు పెట్టుకొనైనా బ్రతుకుతారుగాని ఇట్లా ఇతరులఎదుట చెప్పేసుకోవడమా? ఛి...ఛీ! ఎంత అప్తులైతే మాత్రం ఇటాంటి సంగతులు సరసానికైనా చెప్పుకోవచ్చా? ఈమధ్య మరీ ఇదైపోతున్నారు లెద్దూ-అని బాధపడూ వచ్చింద ఆబాధతోనే అతని ప్రవర్తన నుద్దేశించి, "నాకెంత బాధగా వుందో, తెలుసా?" అంది గాద్గదికంగాను.

గంభీరంగా, నిలబడి యేదో యోచిస్తున్న రామకృష్ణకి ఆమె మాటల్లోని అంతరార్థం బోధపడలేదు. మొత్తానికి అతనాలో చిస్తున్నదీ ఇందాకటి విషయమే అయితే భార్యకీ అతనికీ ఇందులోనూ చాల వ్యత్యాసం కన్పిస్తుంది.

ఇందాక పిన్నమ్మగారితో తానన్న మాటలు సర్దాగా అన్నవి ఎంత మాత్రం కావు కాని, వారంతా కేవలం తాను హాస్యానికే అలాగన్నాననుకొంటున్నట్లు కన్పిస్తున్నారు. అంటే, రేపుదయమే తను పెళ్లాంపిల్లల్ని వెంట తీసుకొని స్వంత నివాసానికి చేరుకోవాలన్న మాట. పెళ్లని ఇంటికి తీసుకెళ్లడానికే జేబుల్లో ఏమీ లేవే— ఇక తీసుకుపోయి ఈ నాలురోజులూ ఎట్లా గడిపేది? చూచేవాళ్లకేం దక్కగానే కన్పిస్తారు తామంతాను 'వాళ్లకేమమ్మ-చిలకా గోరింకల్లా, పిల్లాపీచుతో హాయిగా వుంటారు' అంటారు కూడాను. వాళ్ల ఊహల్లో తను తెచ్చేది సంసారానికి సరిపోగా, ఇంకా పదో పరకో బాంకీలో వేసుకోవడానికీ మిగుల్తుందని! అవును మరి, తిండీబట్టల ఖర్చు లెక్కలేగా వాళ్ళందరికీకన్పించేది! కాని, పిల్లల చదువు సంధ్యలకీ, తమ కప్పుడప్పుడు వచ్చేకుంటుల అవసరాలకీ-తరుచుగా భార్య పట్టుదలవల్ల తీరవేర్చాల్సి వచ్చే ఇటువంటి సంతుగపబ్బాలకీ ఎంతెంత అయిపోతుంటుందో తమకిప్ప డక్కడక్కడా చిల్లరమల్లరఅప్పులెన్ని వున్నయ్యో—ఇవన్నీ ఎవరికి తెలుస్తాయి? ఇలా తెలియవని, మరీ, తెగించి ఎలా చెప్పుకోనేది? 'సభ్యత', 'అభిమానం' ఇంకా ఇట్లాటివి చావలేదుగా! అయితే మరి.

ఆ ఆలోచనలతో సతమతమైపోతూ మౌనంగానే వుండిపోయిన భర్తని, తిరిగి రెట్టించింది కమల "నాకెంత బాధగావుందో తెలుసా?" కాని, ఈసారికూడా "మీ ప్రవర్తన" అని వివరించి చెప్పలేకపోయింది— ఎంత అభిమానవతియైనా, అవతలి వ్యక్తి 'భర్త' అన్న గుర్తింపు వుంది కనుక.

ఈసారి తేరుకొని రామకృష్ణ ఆమెని దగరికి తీసుకొంటూ "నిజం, నాకూ చాల బాధగావుంది! నిజం చెప్పేకూడా నమ్మించలేకపోతున్నామే, ఇంకెట్లా బ్రతికేది?" అన్నాడు, తనలో తాననుకొంటున్నట్లుగాను...

మిలిమించిన క్రోధంతో తలెత్తిమాచింది కమల.

రామకృష్ణ మాత్రం ఇంటికప్పుకేసి చూస్తూ, మళ్లీ ఏదో దీర్ఘాలోచన ఆరంభించి బరువుగా నిట్టూరుస్తున్నాడు.

భర్త సితికి చకితురాలై, అలానే చూస్తూ నిల్చుండిపోయిందామె ★



తామర, గజ్జి మరియు దురదలకు
ఆంధ్రదేశానికి ఏజెంట్లు:
ది ట్రేడ్ ప్రమోటింగ్ కార్పొరేషన్.
విజయవాడ - 2. RPC